క్లుప్తంగా

స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలి

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారిని తిరుపతి వాసులు దర్శించుకునే వెసులు బాటు కల్పించాలని విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీవారిని దర్శించుకునే హక్కు స్థానికులకు ఉంటుందని పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం, ఎమ్మెల్యే ప్రతి నెలా తొలి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

దివ్యాంగులను భవిత కేంద్రంలో చేర్పించండి



ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలను సేకరిస్తున్న అధికారులు

పాకాల : ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సాధారణ పిల్లల మాదిరిగానే పాఠశాలల్లో చేర్పించవచ్చని జిల్లా సమగ్ర శిక్షా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ఇరంగారిపల్లి, శ్రీనివాసపురం, ముద్దలపల్లి, ఉప్పువంక, దేశిరెడ్డిపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో సర్వే చేశారు. ఆయన మాట్లాడుతూ గత నెల నుంచి దివ్యాంగ పిల్లల ను భవిత కేంద్రంలో నమోదు చేసే సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగ పిల్లలు సాధా రణ పిల్లల్లాగే మెలగలేరని, వారిని భవిత కేంద్రంలోనే చేర్పించాలని సూచించారు. దివ్యాంగులకు అర్హత కలిగిన భవిత కేంద్రంలోని సహిత ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ ఇచ్చి సాధారణ పిల్లల మాదిరిగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. వీరికి అందించే ప్రత్యేక శిక్షణ, ఉచిత ఉపకరణాలు పొందాలని తెలిపారు. జిల్లా సమగ్ర శిక్ష ప్రణాళిక సమన్వయకర్త రామచంద్రారెడ్డి, ఎంఈవో బాబ్జి, ఐఈఆర్టీలు మునికృష్ణారెడ్డి, సుందరి పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపండి



తనిఖీ చేస్తున్న అధికారులు

రేణిగుంట: చిన్న పిల్లలందరినీ బడికి పంపాలని తిరుపతి రెండో సర్కిల్ సహాయ కార్మిక అధికారి(రేణిగుంట పరిధి) శ్రీమాన్ నారాయణ సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం రేణిగుంటలోని దుకాణాలు, హోటళ్లు, సంస్థల్లో ఆయన తనిఖీలు చేశారు. ఆయన నిర్వాహకులతో మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులకు కఠిన శిక్ష ఉంటుందని హెచ్చరించారు. సహాయ కార్మిక కమిషనర్ బీవీఎస్ కృష్ణారెడ్డి, అధికారులు జి.రంగనాథ్, డి.శ్రీధర్ పాల్గొన్నారు.

భూసార పరీక్ష.. నేలకు రక్ష

- దృష్టి సారిస్తే రైతుకు మేలు
- ఆచరణకు తరుణమిదే



మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

భాకరాపేట : రైతు ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తాడు. తగిన దిగుబడి రాకుంటే నష్టాల పాలవుతాడు. ముందుగా నేల స్వభావం తెలుసుకుని ఏ పంటకు ఎంత మోతాదులో ఎరువులు వేయాలి. ఏఏ పంటలు అనుకూలంగా ఉంటాయి అన్న వివరాలు ముందే తెలుసుకుని అందుకు అనుగుణంగా ఎరువులు వాడితే రైతులు నష్టపోయే అవకాశం ఉండదు. అంతేగాక పెట్టుబడులు కూడా తగ్గుతాయి. అధిక దిగుబడులు సాధించవచ్చు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా భూసార పరీక్షలు చేయిస్తోంది. తద్వారా రైతులకు పంటల సాగులో సాయం అందిస్తూ నష్టపోకుండా చూడడంతోపాటు అధిక దిగుబడి వచ్చేలా చర్యలు తీసుకుంటోంది.

భూసార పరీక్షలతో లాభాలు

- పొలంలోని ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చు.
- మట్టి పరీక్షల ఫలితాల వల్ల ఏ పంట వేయాలి, ఏ పంటకు ఏయే ఎరువులను ఎంతెంత మోతాదులో వేయాలనే విషయాలు తెలుసుకోవచ్చు.
- పొలాల్లో చౌడు, ఆమ్ల స్థాయిని నిర్ధారించి వాటిని తగ్గించేందుకు అవసరమైన యాజమాన్య పద్ధతులు పాటించేందుకు అవకాశం ఉంటుంది.
- రసాయనిక ఎరువులపై అదనపు వ్యయాన్ని తగ్గించవచ్చు.

మట్టి నమూనాలు సేకరించే విధానం

- రైతులు తమ పొలంలోని ఒక ఎకరంలో కనీసం ఆరు నుంచి ఎనిమిది చోట్ల ఆరు నుంచి ఎనిమిది అంగళాల లోతు తవ్వి మట్టిని తీయాలి.
- సేకరించిన నమూనాలను బాగా కలిపి శుభ్రమైన గోనె సంచిలో వేయాలి. ఆ మట్టిని నీడలో పరిచి ఆరబెట్టాలి. గడ్డలు లేకుండా మెత్తటి పొడిగా చేయాలి.
- మట్టిని ఒక పారగా చేసి నాలుగు భాగాలుగా విభజించాలి. ఇలా తీసుకున్న మట్టిని ఒక ప్లాస్టిక్ కవర్‌లో వేసి రైతు వివరాల చీటీని అందులో ఉంచాలి. వ్యవసాయాధికారుల ద్వారా భూసార పరీక్షల కేంద్రానికి పంపించాలి.
- ఈ మట్టిని భూసార పరీక్ష కేంద్రంలో పరీక్ష చేసి అందులో ఉన్న ఉదజని, లవణాలు, సేంద్రియ కర్బనాలు, నత్రజని, భాస్వరం, పొటాష్ తదితర పోషకాల స్థాయిని గుర్తిస్తారు. అధిక దిగుబడికి వాడాల్సిన ఎరువుల మోతాదును సూచిస్తారు.

పరీక్ష వెంటనే ఫలితాలు

గతంలో భూసార పరీక్షలు చేయించుకునేందుకు మట్టి నమూనాలను అధికారులకు ఇస్తే ఫలితాలు నెలలు గడిచినా వచ్చేవి కావు. దాంతో రైతులు వాడిన మందులనే వాడుతూ నష్ట పోయేవారు. ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ప్రస్తుతం ప్రతి మండలానికీ భూసార పరీక్ష కిట్లను అందజేసింది. మండలంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతు పలాల్లోకి వెళ్లి పరీక్షలు జరిపి అక్కడికక్కడే ఫలితాలను తెలియజేస్తారు. ఆ రైతుకు సంబంధించి భూసార ఆరోగ్య కార్డును అందజేస్తారు.

> **పరీక్షలకిదే మంచి తరుణం**
>
> భూసార పరీక్షలకు ఇదే అనుకూలమైన సమయం. భూసార పరీక్షలు చేయించుకోవాలి. పరీక్షలు చేసుకున్న వెంటనే ఫలితాలను అందిస్తాం. పరీక్షల ద్వారా తమ భూముల్లో పోషక విలువలు తెలుసుకుని వాటికి అనుగుణంగా వాడుకోవాల్సిన ఎరువులను సూచిస్తాం. వాటిని వాడితే అధిక దిగుబడులు సాధించుకునేందుకు అవకాశం ఉంటుంది.
>
> – ధనలక్ష్మి, వ్యవసాయాధికారి, చిన్నగొట్టిగల్లు

భూమనను కలిసిన ఎంపీ గురుమూర్తి



మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని, భూమన అభినయ్‌రెడ్డిని కలిసిన ఎంపీ గురుమూర్తి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, నేతలు, కార్యకర్తలు

తిరుపతి మంగళం : సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించిన తిరుపతి ఎంపీ గురుమూర్తి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బుధవారం తిరుపతి పద్మావతిపురంలోని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వెలువడిన ఎన్నికల ఫలితాలపై చర్చించుకున్నారు. అనంతరం పార్లమెంట్ సభ్యుడుగా విజయం సాధించిన మద్దిల గురుమూర్తిని భూమన కరుణాకరరెడ్డితోపాటు భూమన అభినయ్‌రెడ్డి అభినందించారు. తిరుపతిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున భూమన నివాసం వద్దకు వచ్చి ఎన్నికల ఫలితాలపై ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకుల దాడులు





తిరుపతి కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యురాలు శ్రీదేవి ఇంటిపై టీడీపీ నేతలు విసిరిన రాళ్లు, జెండాలు

తిరుపతి మంగళం : రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన 24 గంటలు గడవక ముందే టీడీపీ కూటమి నేతల అరాచకాలు మొదలయ్యాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రానున్న ఐదేళ్లలో ఏ స్థాయిలో దాడులు చేస్తారో అంటూ చర్చించుకుంటున్నారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు పూర్తిస్థాయిలో వెలువడక ముందే కక్ష సాధింపు చర్యలను ప్రారంభించారు. తిరుపతి నగరంలోని కొర్లగుంటలో నివాసం ఉంటున్న తిరుపతి కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యురాలు శ్రీదేవి ఇంటి వద్ద పలువురు యువకులు బైక్‌లకు ఫ్యాన్ కట్టుకుని రోడ్డుపై ఈడ్చుకుంటూ కేకలు వేశారు. భయాందోళన వాతావరణాన్ని సృష్టించారు. శ్రీదేవి ఇంటిపై రాళ్లు, చెప్పులతోపాటు టీడీపీ జెండాలను విసిరివేశారు. అనంతరం దాడులకు తెగబడ్డారు. చంపుతామంటూ బెదిరించారు. అంతేకాకుండా అసభ్యకర పదజాలంతో దూషించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు వారిని అడ్డుకుని మంచివాళ్లు అంటూ ఓట్లు వేసి గెలిపిస్తే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారేంటి అని మండిపడ్డారు. వచ్చే ఐదేళ్లలో ఇంకా ఎలాంటి అరాచకాలకు పాల్పడతారో అంటూ చర్చించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల వద్ద 45వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ అనీష్‌రాయల్ గట్టిగా నిలబడి పార్టీకి అండగా ఉన్నారనే ద్వేషంతో ఆయనపై దాడులు చేయడానికి రెక్కీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆ ప్రాంతమంతా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మంగళవారం రాత్రి 45వ డివిజన్ ప్రాంతంలో అనీష్‌పై దాడి చేయడానికి సుమారు 100 మందికి పైగా టీడీపీ నేతలు పహారా కాయడంపై అంతా ఆందోళన చెందుతున్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెలు ధ్వంసం



శేషాపురం గ్రామంలో టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన రచ్చబండ, వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మె

చంద్రగిరి/పాకాల: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించిన టీడీపీ నాయకులు దాడులకు తెగబడుతున్నారు. మండలంలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు, వైఎస్సార్‌సీపీకి చెందిన దిమ్మెలను ధ్వంసం చేస్తున్నారు. బుధవారం చంద్రగిరిలోని శేషాపురంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెలను ధ్వంసం చేశారు. వాటి పక్కనే ఉన్న రచ్చబండలను సైతం ధ్వంసం చేయడంతో ప్రజలు నివ్వెరపోయారు. దీనిపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, పార్టీ జెండాలను, దిమ్మెలను ధ్వంసం చేయడం మంచి సంస్కృతి కాదంటూ వాపోతున్నారు. అదేవిధగా పాకాల మండలం నేంద్రగుంటలో వైఎస్సార్ సీపీ దిమ్మెలను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు.

తిరుపతిలో జోరువాన









తిరుపతి నగరంలో బుధవారం మధ్యాహ్నం నుంచి జోరు వాన కురిసింది. దీంతో పలురోడ్లపై వర్షపు నీరు పొంగిపొర్లింది. వాహనదారులు, పాదచారులు తడిసి ముద్దయ్యారు. కొందరు గొడుగులు, రెయిన్‌కోట్ సహాయంతో ద్విచక్ర వాహనాలపై తిరిగారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

తిరుపతి(తుడా): ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ తెలిపారు. వైద్య కళాశాలలో బుధవారం ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆస్పత్రి, చిన్న పిల్లల విభాగం వైద్యాధికారులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభు, ఎస్వీ వైద్య కళాశాల క్యాన్సర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నోడల్ అధికారి డాక్టర్ వై.వెంకట్ లక్ష్మీ, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్లు రోజారమణి, చండీప్రియ, సునీత పాల్గొన్నారు.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ



నీట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో అశ్వమేధ కళాశాల ప్రతినిధులు



నీట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య ఏజీఎం

దేశవ్యాప్తంగా విడుదలైన నీట్ పరీక్ష ఫలితాల్లో తిరుపతి నగరంలోని పలు ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎంబీబీఎస్‌లో సీట్లు పొందేలా మార్కులు సాధించినట్టు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులను అభినందించారు.
– తిరుపతి ఎడ్యుకేషన్



సి.సాత్విక, బసవలింగ, కె.దినేష్, పి.సాయిధన్విత



తోసిని సత్య, టి.అజిత్, జే.చైతన్యరెడ్డి

అశ్వమేధలో..

నీట్ పరీక్షా ఫలితాల్లో తిరుపతి ఎయిర్ బైపాస్‌రోడ్డులోని అశ్వమేధ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటినట్లు ఆ కళాశాల డైరెక్టర్లు అబ్దుల్ ఇష్రత్, టీఎం.గోవర్ధన్ తెలిపారు. ఎ.లక్ష్మీనరసింహారెడ్డి 669 మార్కులు, ఎం.శ్రావ్య 639, ఎం.జోషిక 637, పి.శ్రీహర్షిత 616, వి.చైతన్యప్రియ 610 మార్కులు సాధించారని, వీరితో పాటు 550కి పైగా మార్కులను 30 మంది, వివిధ కేటగిరీల్లో 55 మంది ఎంబీబీఎస్ సీట్లు సాధించనున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులను వారు అభినందించారు.

డాక్టర్స్ మెడికల్ అకాడమీలో..

నీట్ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చాటారు. సి.సాత్విక 661 మార్కులు, బసవలింగ 658, కె.దినేష్ 657, పి.సాయిధన్విత 655, కె.లహరి 642, జి.బాలాజీ 637, కె.వంశీధర్‌రెడ్డి 631, పి.జ్యోతివర్ధన్‌రెడ్డి 619, కె.శ్రీదేవి 615, ఆర్.వజ్ర, కె.భవ్యశ్రీ 610, షేక్ మీరజ్ 609, బి.రోషిత 604, కె.షనితామాధురి, కె.శ్రావణి 600 మార్కులు సాధించారు. వీరితో పాటు 550కిపైగా మార్కులు 25 మంది, 500కు పైగా 50 మంది, మొత్తం 80మందికి పైగా విద్యార్థులు ఉచిత మెడికల్ సీట్లు సాధించనున్నట్లు అకాడమీ చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి తెలిపారు. విద్యార్థులను అకాడమీ వైస్ చైర్మన్ పార్థివ్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ కె.రహీమ్ అభినందించారు.

శ్రీధర్స్ అకాడమీలో..

నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ఈ ఫలితాల్లో తోసిని సత్య 678 మార్కులు, టి.అజిత్ 656, జే.చైతన్యరెడ్డి 610, టి.ఐశ్వర్య 609, పి.వర్షిణి 581, పి.వైష్ణవి 562, ఈ.కార్తిరూప్‌రెడ్డి 557, చార్మిత 539, కె.దుర్గ 529, ఈఆర్.గీతాంజలి 520, పి.జ్ఞానప్రిస్కిల్లా 513, టబురెడ్డి 510 మార్కులను సాధించినట్లు అకాడమీ చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలిపారు. విద్యార్థులను ఆయనతోపాటు అధ్యాపకులు అభినందించారు.

శ్రీచైతన్యలో..

నీట్ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని శ్రీచైతన్య విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. ఎ.ప్రణీత 710 మార్కులు, బి.చరిష్మ 690, జీఆర్.కీర్తన్‌రెడ్డి 687, ఎస్.షాహిద్ 669, యస్మిత 661, వెంకటకల్పన 650, ఎ.తుల్య 640, పి.సాత్విక 639, ప్రనవసాయి 637, జశ్వీర్ 636, ఎస్.భవిత, ఎం.హర్షవర్ధన్‌రెడ్డి 627, ఈ.సింధు 623, ఎం.వీర శ్రావణ్‌రెడ్డి 621, ఎస్.సోహ 620, ఎస్.భానుశ్రీ 619, పి.దర్శిని 617, దుర్గాప్రసాద్ 615, కె.నందిని, జి.ఉమ రూపాదేవీ 613, డి.ప్రేమనారాయణ 611, ఎ.కుశల్ 608, నవ్యశ్రీ, జి.సుప్రియ, ఎస్.వీక్షిత సాయి 607, సీహెచ్.బిజుసర్వజిత్ 602 మార్కులు సాధించారు. అన్ని కేటగిరిల నుంచి దాదాపు 160 మందికి పైగా విద్యార్థులు మెడికల్ సీటు వచ్చే మార్కులు సాధించినట్లు ఆ విద్యాసంస్థ ఏజీఎం బీవీ.ప్రసాద్ తెలిపారు. విద్యార్థులను ఆ సంస్థ డీన్‌లు కేఎల్‌జి.ప్రసాద్, రామమోహన్‌రావు, కుమార్, భాస్కర్, ప్రిన్సిపాల్స్ తదితరులు అభినందించారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



క్లాత్ సంచులను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు



పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు

తిరుపతి కల్చరల్: మార్గదర్శి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని, క్లాత్ సంచులనే వాడాలని కోరుతూ కోటి క్లాత్ సంచులను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో సుమారు వెయ్యి క్లాత్ సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హిందూస్తానీ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి, పర్యావరణ నెట్‌వర్క్ కన్వీనర్ విజయబాబు, ప్రాజెక్ట్ మేనేజర్ రుద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడంతోపాటు భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలని కోరారు. క్లాత్ సంచులు వినియోగించి భారతదేశాన్ని ప్లాస్టిక్ మహమ్మారి నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు సువర్ణ, శైలజ, శేఖర్, రమాకాంత్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తిరుపతి తుడా: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ తెలిపారు. ఎస్వీ మెడికల్ కళాశాలలో బుధవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణాన్ని పరిరక్షించడంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో అనేక అనర్థాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. అనంతరం వైద్య విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్వీ మెడికల్ కళాశాల పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. నో వెహికల్ డేను చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు డాక్టర్లు వసీం అక్రమ్, రామాంజనేయులు, సత్యనారాయణ మూర్తి, శశికళ, కృష్ణకుమారి, కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

సీగొల్లపల్లి సిద్దార్థ కళాశాలలో..

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం సీగొల్లపల్లిలోని సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యం వల్ల వాతావరణంలో ప్రాణవాయువు తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థీ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

మానవ శ్రేయస్సుకోసం మొక్కలు నాటాలి

తిరుపతి సిటీ : మానవ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మహిళా వర్సిటీ వీసీ డి భారతి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా బుధవారం వర్సిటీలో ఆమె మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ మానవ మనుగడకు చెట్లు ఎంతో అవసరమన్నారు. సుస్థిర భవిష్యత్తు కోసం పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. మొక్కలు నాటడంతో సరిపోదని, వాటిని సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యావతి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మానవ మనుగడకు చెట్లే ఆధారం

మానవ మనుగడకు చెట్లే ఆధారమని, పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి నారాయణమ్మ పిలుపునిచ్చారు. కళాశాల ఆవరణలో బుధవారం ఎన్ఎస్ఎస్, పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె వర్సిటీలో ఔషధ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ భువనేశ్వరీదేవి, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ వి క్రిష్ణ వేణి, అధ్యాపకులు బి జ్యోతి, విద్యుల్లత, సునీత, లక్ష్మీ, వరప్రసూన పాల్గొన్నారు.

ఎస్వీయూలో..

తిరుపతి సిటీ : చెట్లతోనే మానవాళి మనుగడ సాధ్యమని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.



ఎస్వీయూలో మొక్కలు నాటుతున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి, వర్సిటీ అధికారులు



పద్మావతి మహిళా కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ నారాయణమ్మ, అధ్యాపకులు



పద్మావతి మహిళా యూనివర్సిటీలో మొక్కలు నాటుతున్న వీసీ డి భారతి

ఎస్వీయూలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వీసీ శ్రీకాంత్ రెడ్డి మొక్కలు నాటే కార్యక్రమాని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వరదరాజన్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సోము రవికుమార్, సభ్యులు పురుషోత్తం రెడ్డి, కేవీ చలపతి, రాజేష్‌కుమార్, హేమ చంద్ర, జయరాం ప్రసాద్, డాక్టర్ కిషోర్, ఈషా సంస్థ సేవ్ ది సాయిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి రూరల్ : కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్, విద్యార్థులు